భక్తి..శక్తి..!

- 'శక్తి' పథకంతో ఆలయాల్లో పెరిగిన రద్దీ
- రెండు నెలల్లో రూ.70 కోట్ల ఆదాయం



బెంగళూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐదు గ్యారెంటీలలో ఒకటైన 'శక్తి' పథకం ఆలయాలకు వరించినట్లయ్యింది. ఉచిత ప్రయాణమో..పెరిగిన భక్తి భావమో కానీ ఆలయాలకు ఆదాయం మాత్రం భారీగా పెరిగిపోయింది. శక్తి పథకం ద్వారా బీఎంటీసీ, కేఎస్ఆర్టీసీలలో మహిళలు ఉచిత ప్రయాణానికి వీలు కల్పించడంతో ఆలయాల సందర్శనకు వెళ్లేవారు అధికమయ్యారు. ఈ ఏడాది కేవలం రెండు నెలల్లో పది ఆలయాలకు రూ.70కోట్ల ఆదాయం సాధ్యమైంది. దేవదాయ, ధర్మాదాయశాఖ పరిధిలోని ఆలయాలకు ఈ ఏడాది ఆదాయం రెట్టింపు అయినట్లు తెలుస్తోంది. శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం సాధ్యం కావడంతో పెద్దసంఖ్యలో ఆలయాలను సందర్శిస్తున్నారు. దీని ప్రభావం రెండుమూడు రెట్ల ఆదాయం సాధ్యమైంది.



కేఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి వేచి ఉన్న మహిళలు

గతేడాదితో పోలిస్తే..

గణాంకాల ప్రకారం 2024 డిసెంబరు చివరినాటికి పది ప్రముఖ దేవాలయాల ఆదాయం రూ.305 కోట్లు ఉండగా 2025 జనవరి, ఫిబ్రవరి నెలలతో కలిపి రూ.375 కోట్లుగా ఉంది. తద్వారా రెండు నెలల్లో రూ.70కోట్ల ఆదాయం గడించినట్లయ్యింది. అన్ని ఆలయాలు కలిపితే ఆదాయం మరింత పెరుగుతుంది. ప్రస్తుతం పరీక్షల కాలం కావడంతో ఏప్రిల్, మే నెలల్లో వేసవి సెలల్లో పాఠశాల, కళాశాలలకు సెలవులు రానుండడంతో ఆలయాలను కుటుంబ సమేతంగా సందర్శించడం అధికం కానుంది. దీనికితోడు జాతరలు కూడా కొనసాగనుండడంతో ఆలయాలలో హుండీ ఆదాయం పెరగనుంది.



ఆలయాలకు పెరుగుతున్న భక్తుల రాక

శక్తి పథకం అమలయ్యాక దాదాపు అన్ని ఆలయాల్లో భక్తుల సంఖ్య పెరుగుతోందని రవాణా, దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి పేర్కొన్నారు. మార్చి నుంచి మే వరకు భక్తుల తాకిడి మరింత అధికం కానుందన్నారు. జాతరల నేపథ్యంలో ఆదాయం కూడా పెరుగుతుందన్నారు.

కుక్కె సుబ్రహ్మణ్య స్వామి దర్శనానికి వేచియున్న భక్తులు(ఫైల్)

కమిటీల ఏర్పాటు

దేవాలయాల్లో ఆదాయం, ఖర్చు, ఇతర నిర్వహణకు సంబంధించి 2023లో ధార్మిక పరిషత్ చట్టాన్ని రూపొందించారు. దీని ప్రకారం 205 ఏ గ్రేడ్ ఆలయాలలో ఒక అధ్యక్షుడు, 8మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. 193 బి గ్రేడ్ ఆలయాల్లో జిల్లా అధికారులే ఒక కమిటీని రూపొందించారు. ఇలా ప్రతి ఆలయానికి ఒక్కో కమిటీ ఉండడంతో ఆలయానికి వచ్చే ఆదాయం ద్వారా ఆయా ఆలయాలలో భక్తులకు ఎలాంటి సదుపాయాలు కల్పించాలి, ఇతరత్రా అభివృద్ధి పనులను కమిటీయే పర్యవేక్షించనుంది. మిగిలిన మొత్తాన్ని ఆలయాల పేరిట సదరు బ్యాంకు ఖాతాలలో జమ చేయనున్నారు. ఒక రూపాయి కూడా ఇతర ఉద్దేశ్యాలకు ఖర్చు చేసేది లేదని దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి స్పష్టం చేశారు.

జనవరిలో ధనుర్మాసం కొనసాగడంతో అయ్యప్పస్వామి మాల ధారులు అధిక సంఖ్యలో ఆలయాలను దర్శించారు. సంక్రాంతి పండుగ అనంతరం మహాశివరాత్రి, ఇటీవల కొన్ని రోజులుగా ముహూర్తాలు పెద్దసంఖ్యలో ఉండడంతో పెళ్లిళ్లు భారీగా జరిగాయి. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలైన కుక్కె సుబ్రమణ్య, మైసూరులోని చాముండేశ్వరి, యడియూరు సిద్దలింగేశ్వర, నంజనగూడు శ్రీకంఠేశ్వర, కొప్పళలోని హులిగెమ్మ, బెంగళూరులోని బనశంకరిదేవి తదితర ఆలయాలకు భక్తుల తాకిడితో కోట్లాదిరూపాయల ఆర్జన వచ్చింది.

ఆలయం పేరు	2024 డిసెంబరు నాటికి (రూ.కోట్లలో)	2025 ఫిబ్రవరి నాటికి (రూ.కోట్లలో)
కుక్కె సుబ్రమణ్యస్వామి	112.27	137.25
కొల్లూరు మూకాంబికా	56.79	67.18
మైసూరు చాముండేశ్వరి దేవి	37.16	42.71
యడియూరు సిద్దలింగేశ్వర	22.67	27.25
సవదత్తి రేణుకా యల్లమ్మ	16.02	26.91
నంజనగూడు శ్రీకంఠేశ్వర	20.42	24.50
కొప్పళ హులిగెమ్మ	13.82	15.85
మందార్తి దుర్గా పరమేశ్వరి	10.84	13.61
దొడ్డబళ్ళాపుర ఘాటి సుబ్రమణ్య	7.76	10.11
బెంగళూరు బనశంకరి	7.59	10.11



హనుమంత వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

హనుమంత వాహనంపై దేవదేవుడు

కదిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లాలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి గురువారం హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయం నిత్య పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి, గ్రామోత్సవం నిర్వహించారు. త్రేతాయుగంలో రామలక్ష్మణలను తన భుజస్కందాలపై మోసిన హనుమంతుడు.. కలియుగంలో నారసింహుడికి వాహనంగా మారి, తన కోరికను తీర్చుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. విద్యుద్దీపాల వెలుగులు, మల్లెల సౌరభాల నడుమ తిరువీధుల్లో విహరించిన స్వామివారిని దర్శించుకోవడానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. నారసింహుడి నామస్మరణతో కదిరి వీధులు మార్మోగాయి. వేడుకలలో ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మగరుడ సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారికి బ్రహ్మగరుడ సేవ నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్ట వాహనమైన గరుత్మంతున్ని నారసింహుడికి వాహనంగా పంపుతారని, అందుకే ఈ ఉత్సవాన్ని బ్రహ్మగరుడ సేవ అని పిలుస్తారని వేద పండితులు చెబుతారు. స్వామివారికి ఉదయం నిత్యపూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. సంధ్యాసమయంలో గరుడ దండం ప్రతిష్టించి, శ్రీవారిని తిరువీధుల్లో ఊరేగిస్తారు. కొక్కంటి పాల్లెగాళ్లు శనివారం నుంచి శ్రీవారి సేవలో భాగస్వాములై దివిటీని మోస్తారు.



శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

అత్యధిక అప్పులు చేసిన ఆర్థిక నిపుణుడు..!

- అభివృద్ధి శూన్యం.. ● బడ్జెట్‌లో అన్నీ అంకెల గారడీలే : ప్రతిపక్ష నేత అశోక్ ఎద్దేవా

బెంగళూరు, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : ఏడున్నర దశాబ్దాల కాలంలో అత్యధిక అప్పులు చేసిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య అంటూ ప్రతిపక్ష నేత సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌పై సుదీర్ఘంగా మాట్లాడిన అశోక్ పలు గణాంకాలను సభ ముందు ఉంచారు. ప్రస్తుతానికి రాష్ట్ర ప్రభుత్వ అప్పులు రూ.7.81లక్షల కోట్లుగా ఉందన్నారు. అందులో రూ.4.91లక్షల కోట్లు సీఎం హోదాలో సిద్దరామయ్య చేశారన్నారు. దీని ప్రకారం 63శాతం అప్పులు చేసినట్లు అన్నారు. సిద్దరామయ్యను అందరూ ఆర్థిక నిపుణుడంటూ కొనియాడుతారని అది అప్పులు చేసేందుకేనా అంటూ ప్రశ్నించారు. ఇదే సందర్భంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్, అప్పులపైనా చర్చించాలని కాంగ్రెస్ సభ్యులు లేవనెత్తిన అంశానికి అశోక్ తిప్పి కొట్టారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ అప్పుల గురించి మాట్లాడాలనే ఆసక్తి ఉంటే సిద్దరామయ్యను వచ్చే ఎన్నికలలో ఎంపీగా గెలిపించి లోక్‌సభకు పంపాలన్నారు. మనం పార్లమెంటులో లేమని రాష్ట్ర శాసనసభలో ఉన్నామని ఇక్కడికి సంబంధించిన అంశాలను మాత్రమే ప్రస్తావిస్తామన్నారు. బడ్జెట్‌లో సిద్దరామయ్య మాయ చేశారన్నారు. అంచనాల బడ్జెట్‌లో ఎటువంటి అప్పులు చూపలేదని కానీ ఏప్రిల్ తర్వాత నుంచి పెట్రోలు, డీజిల్, మద్యం, పాలు, రిజిస్ట్రేషన్‌ల వంటి అన్ని విభాగాల పన్నులు పెరుగుతాయన్నారు. అప్పులు అభివృద్ధికి మాత్రమే అని సూచించారని కానీ ఆవిధంగా అమలు చేయడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీల గ్రాంట్‌లను గ్యారెంటీలకు ఉపయోగించారన్నారు. 2011 జనాభా ప్రకారం ఎస్సీ జనాభా 1.04 కోట్లు 17.11 శాతం కాగా ఎస్టీ జనాభా 42లక్షలుగా 6.95శాతంగా ఉన్నారన్నారు. సమాజంలో ఎస్సీ, ఎస్టీలు పదేళ్ళు వెనుకబడి ఉన్నారని వారిని అన్ని విధాలుగా అభివృద్ధి వైపు తీసుకురావాలని కానీ సమాజంలో అందరికీ సమానంగా గృహలక్ష్మి వంటి పథకంతో పాటు పలు సంక్షేమాలను ఒకే విధంగా ఇవ్వడం ఎంతవరకూ సమంజసమన్నారు. మైనార్టీలకు బడ్జెట్‌లో కేటాయించింది తక్కువ అని మంత్రి జమీర్ అహ్మద్ చెబుతారని ఎద్దేవా చేశారు. ఎస్సీ,ఎస్టీ సామాజిక వర్గాల అభ్యున్నతి ఎలా సాధ్యమన్నారు. సబ్‌ప్లాన్ ప్రకారం వారికి కేటాయించిన గ్రాంట్‌లు ఇతరత్రా ఉపయోగించరాదనే విధానం పాటిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. బడ్జెట్ లో ఏడాదిలో ఎంత మేర అప్పులు చేయాలనేందుకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. కేవలం అంకెల గారడీతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. రూ.లక్షల కోట్ల బడ్జెట్‌లో ప్రజలకు దక్కేది శూన్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు.



సభలో మాట్లాడుతున్న ప్రతిపక్షనేత అశోక్

జోరందుకున్న విందు రాజకీయాలు

- ఇప్పటికే మూడు పార్టీల వారీగా సాగిన వైనం ● డీసీఎం ప్రత్యేక విందుపై పార్టీలో కలకలం

బెంగళూరు, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : శాసనసభ సమావేశాలు జరుగుతున్న తరుణంలో రాష్ట్రానికి చెందిన శాసనసభ్యులందరూ బెంగళూరులోనే ఉన్నారు. దాదాపు రెండువారాలుగా శాసనసభ్యులు, పరిషత్ సభ్యులంతా నగరంలోనే ఉన్న సందర్భంలోనే విందులు పెరిగిపోయాయి. పార్టీలవారీగా జరిగే విందులు అయితే ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ ఏకంగా మూడు పార్టీలకు చెందిన సుమారు 60మందికి పైగా వక్కలిగ, లింగాయత సమాజానికి చెందిన వారు మాత్రమే విందు ఏర్పాటు చేయడమే సర్వత్రా ఉత్కంఠగా మారింది. శాసనసభ సమావేశాలు ప్రారంభమైన తర్వాత బీజేపీ సభ్యులందరినీ ఆహ్వానించి సభలో ఏవిధంగా వ్యవహరించాలి అనే విషయమై చర్చించుకున్నారు. అదే రోజున విందు కూడా జరుపుకున్నారు. ఇక జేడీఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు కూడా ఇదే తరహాలోనే వ్యవహరించారు. తాజా రెండురోజుల కిందట కాంగ్రెస్ పార్టీ లెజిస్లేచర్ భేటీ ప్యాలెస్ రోడ్‌లోని ఓ స్టార్ హోటల్‌లో జరిగింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలందరూ పాల్గొన్నారు. ఇదే సందర్భంలో పలువురు ఎమ్మెల్యేలు సమస్యలు వివరించగా మంత్రులు శరణప్రకాష్ పాటిల్, బోసరాజుల మధ్య వాగ్వాదం కాస్త తీవ్రస్థాయికి చేరి ఏకంగా ఒకరిపైకి మరొకరు వెళ్ళేంత స్థాయికి చేరింది. ఆతర్వాత సర్దుబాటు చేసి విందును కొనసాగించారు. అంతలోనే మూడు పార్టీలకు చెందిన 60మంది ఎమ్మెల్యేలు ప్రత్యేక విందు జరపుకున్నారు. వీరిలో కొత్తగ ఎన్నికైన శాసనసభ్యులతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర వంటి వారు ఉన్నారు. విందులో ఎటువంటి చర్చలు జరిగాయనేది కీలకమవుతోంది. బీజేపీ జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ పాల్గొనడం మరో ప్రత్యేకమనిపిస్తోంది. ఇంతమంది ఒకసారి చేరిన సందర్భంలో ఎటువంటి చర్చలు జరిగాయనేది కుతూహలంగాను ఉంది. నాయకత్వ మార్పు అంశం నిరంతరంగా వివాదానికి కారణమవుతున్న వేళ ఇటువంటి విందులు ఎక్కడికి దారితీస్తాయనేది చర్చలకు కారణమవుతోంది. విందు విషయమై మండ్య కాంగ్రెస్ ఎమ్మెల్యే రవిగణిగ మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలందరూ చేరి విందు చేసుకున్నామన్నారు. సహజంగానే అందరూ చేరితే రాజకీయ అంశాలపై చర్చలు ఉంటాయని అందుకు అనుగుణంగానే సాగాయన్నారు. పార్టీలకతీతంగా విందు జరిగిందన్నారు. మరోసారి ఇటువంటి విందు జరిగితే మీడియాను ఆహ్వానిస్తామని కెమెరాలు లేకుండా రావాలన్నారు. కాగా గురువారం రాత్రి డీకే శివకుమార్ కాంగ్రెస్ సభ్యులకు విందు ఏర్పాటు చేశారు. ఇటీవల పలు సందర్భాలలో నాయకత్వ మార్పు, సిద్దరామయ్య మరో మూడేళ్ళు సీఎంగా ఉంటారనే వ్యాఖ్యలపై డీకే శివకుమార్ ఆగ్రహంతో తనకు ఎవరి మద్దతు అవసరం లేదన్న విషయం తెలిసిందే. తాజాగా విందుకు ఆహ్వానించడం సరికొత్త చర్చకు కారణమవుతోంది.



కుంభమేళా తొక్కిసలాటలో బెళగావి మృతులకు 25 లక్షల పరిహారం

బెంగళూరు, మార్చి13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళాలో తొక్కిసలాటలో మృతి చెందిన బెళగావి జిల్లాకు చెందిన నలుగురికి రూ.25లక్షలు చొప్పున పరిహారం అందింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మృతి చెందిన కుటుంబీకులకు రూ.25లక్షలు చొప్పున పరిహారం పంపారు. ఇదే ఏడాది జనవరి 29న మౌని అమావాస్య రోజున స్నానం చేసేందుకు వెళ్ళిన సందర్భంలో సంఘటన చోటుచేసుకుంది. బెళగావికి చెందిన జ్యోతిహత్తరవార, మేఘా హత్తరవాటలు తల్లీకూతుళ్ళు కాగా అరుణకోపడె, మహాదేవి బావనూరులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు బెళగావి జిల్లాధికారి ఖాతాకు కోటి రూపాయల పరిహారం అందింది. త్వరలోనే బెళగావి జిల్లాధికారి మహమ్మద్‌రోషన్ నలుగురు మృతుల కుటుంబీకులకు త్వరలోనే పరిహారం చెక్కులు ఇస్తామన్నారు.

ఎమ్మెల్యేపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

బెంగళూరు, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ నటి రష్మికామందన్నను దూషించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే రవిగణిగపై సుమోటోగా కేసు నమోదు చేయించాలని నటికి సంపూర్ణరక్షణ కల్పించాలంటూ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కొడుగు జిల్లాలో నివసించే కొడవ సమాజానికి చెందిన కొడవ నేషనల్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎన్‌యు నాచప్ప ఫిర్యాదు చేశారు. ఇప్పటికే కేంద్రహోంమంత్రి అమిత్‌షాకు, రాష్ట్ర హోంమంత్రి పరమేశ్వర్‌లకు వినతులు ద్వారా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కమిషన్ చర్యలకు సిద్ధమైతే కాంగ్రెస్ ఎమ్మెల్యే రవిగణిగకు సమస్య ఎదురైనట్లు అవుతుంది. రెండువారాల కిందట ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్ వేదికగా డీసీఎం డీకే శివకుమార్ సినిమారంగానికి చెందిన వారిలో కొందరు అతిగా ఉన్నారని వారికి నట్లుబోల్టులు ఎలా బిగించాలో తెలుసని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలను పలువురు తీవ్రంగా వ్యతిరేకించారు. డీసీఎం డీకే శివకుమార్‌కు మద్దతుగా మండ్య కాంగ్రెస్ ఎమ్మెల్యే రవిగణిగ స్పందిస్తూ బెంగళూరులో చలన చిత్రోత్సవాలకు ఏడాది కిందట రష్మికామందన్నను ఆహ్వానిస్తే అవమానించేలా మాట్లాడారని ఇటువంటి వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. దీంతో నటి రష్మికను మానసికంగా ఇబ్బంది కలిగించారంటూ కొడవ సమాజం తరుపున మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.



మాట్లాడుతున్న రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- మిరప రైతు కష్టాలపై ప్రభుత్వం స్పందించాలి
- మద్దతు ధరతో కొనుగోలు చేపట్టాలి
- నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమం
- రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు మాధవ రెడ్డి

6

బోగస్ డిగ్రీ పట్టాలపై విచారణ ముమ్మరం

బళ్లారి గాంధీనగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(వీఎస్‌కేయూ) వైస్ చాన్స్‌లర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి వేలాది మంది నకిలీ కాన్వొకేషన్ సర్టిఫికెట్లు జారీ చేసిన కేసుకు సంబంధించి విశ్వవిద్యాలయం దర్యాప్తు బృందం ఇప్పటి వరకు 21వేల సర్టిఫికెట్లను పరిశీలించింది. దర్యాప్తు బృందం ప్రతి సర్టిఫికెట్ సీరియల్ నెంబర్లను తనిఖీ ముమ్మరం చేస్తోంది. తనిఖీల్లో ఒక సిబ్బంది తన ఖాతాకు రూ 20లక్షలకు పైగా బదిలీ చేసుకున్నట్లు దర్యాప్తు బృందం గుర్తించింది. ఇప్పటి వరకు 1000కు పైగా నకిలీ సర్టిఫికెట్లు బయటకు వెళ్ళినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అనుమానం వచ్చిన సర్టిఫికెట్లకు సంబంధించిన సమాచారం సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఒక సర్టిఫికెట్ కోసం రూ 10వేలు వసూలు చేసినప్పటికి ఈ వ్యవహారం కోటి రూపాయలు వరకు అవినీతి జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. యునివర్శిటీలో పనిచేసే ఓ కాంట్రాక్టు ఉద్యోగి ఓ విద్యార్థి నుంచి డబ్బు తీసుకుని నకిలీ సంతాలు చేసిన కాన్వకేషన్ సర్టిఫికెట్ అందజేశాడు. అయితే సర్టిఫికెట్ అందుకున్న విద్యార్థి తరువాత ఫీజుకు సంబంధించి రశీదు ఇవ్వక పోవడంతో కొప్పళ జిల్లా కనకగిరికి చెందిన ఫస్ట్‌గ్రేడ్ కళాశాల విద్యార్థికి అనుమానం వచ్చి విశ్వవిద్యాలయంలో ఆరా తీశాడు. తనకు ఇచ్చిన కాన్వొకేషన్ నకిలీదని యునివర్శిటీ అధికారులు తేల్చడంతో నకిలీ సర్టిఫికెట్ల బాగోతం వెలుగు చూసింది. ఆ సందర్భంగా ఫిర్యాదును ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. ఉద్దేశ పూర్వకంగానే ఈ ఫిర్యాదు చేసినట్లు విద్యార్థి చేసిన ఆరోపణలను విశ్వవిద్యాలయం అధికారులు కొట్టిపారేశారు. ఫిర్యాదు నిర్లక్ష్యం కారణంగా అక్రమాలు ఇప్పటివరకు జరుగుతూ వచ్చాయని, ఉన్నత వర్గాల ద్వారా సమాచారం. మూడో వ్యక్తికి డబ్బు అందజేసి నకిలీ కాన్వకేషన్ ప్రమాణ పత్రం పొంది ఉంటేదానిని విశ్వవిద్యాలయానికి అందజేయాలని విశ్వవిద్యాలయం నోటీసులు జారీ చేసింది. ఈ విషయంపై స్పందించిన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ తనిఖీ ఇంకా విచారణ దశలో ఉందని, ఇంకా 5వేల సర్టిఫికెట్లను పరిశీలించాల్సి ఉందని, ఈ తతంగం అంతా ముగిస్తే తప్పా నకిలీ సర్టిఫికెట్ల భాగోతం ఏ స్థాయిలో జరిగిందనే విషయం అర్థం కాదని విశ్వవిద్యాలయం అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



వీఎస్‌కేయూ పాలనా భవనం...



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.46	5.16
శుక్రవారం సాయంత్రం	శనివారం ఉదయం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1602.32	1,584.54
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,028	2.041
నీటి నిల్వ (టీఎంసీలు)	24.67	7.03



దాడిపై ఆరా తీస్తున్న ఎస్పీ శోభారాణి

పెట్రోల్ బంకు సిబ్బందిపై దాడి

● ఇద్దరి అరెస్టు ● పరిశీలించిన ఎస్పీ

బళ్లారి గాంధీనగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని సుధా సర్కిల్ సమీంలో ఉన్న జామ్‌జామ్ పెట్రల్ బంకులో పనిచేసే సిబ్బందిపై మంగళవారం 2గంటల సమయంలో పదిమందికి పైగా గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. దాడి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తుండడంతో నగరంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందనే అనుమానాలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. సుధాక్రాస్‌లో ఉన్న ఓ పెట్రోల్ బంకుకు మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని కొంతమంది యువకులు మోటారు సైకిళ్లపై వచ్చి పెట్రోల్ వేయించుకున్నారు. తరువాత అక్కడ పనిచేస్తున్న కిషోర్ అనే యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనలో కిశోర్‌పై బండరాతితో దాడిచేస్తున్న దృశ్యాలు సీసీ టీవీలో రికార్డు అయ్యాయి. ఘటన అనంతరం సిబ్బందితో ఉన్న డబ్బును లాక్కొని పరారైనట్లు సమాచారం. ఈ మేరకు కౌల్ బజార్‌లో కేసు నమోదు అయింది. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు ఇద్దరిని అరెస్టు చేసినట్లు, సీసీ ఫుటేజీ ఆధారంగా దాడిలో పాల్గొన్న వారిని గుర్తించే ప్రయత్నంలో పోలీసులు ఉన్నారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ శోభారాని బుధవారం ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దాడికి పాల్పడిన వారంతా నగరంలోని శ్రీరాంపురం కాలనీకి చెందినవారిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

నదులపై విద్యార్థులకు అవగాహన

బళ్లారి సిటీ,మార్చి 13(ఆంధ్రజ్యోతి): పశ్చిమ కనుమలలోఉన్న వరాహ(సైహ్యాద్రి) పర్వతం తుంగభద్ర నదికి మూలం అని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. తుంగభద్ర నది పుట్టుక ,ఉపయోగాలపై తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మేథోమథన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇది కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గుండా ప్రవహించి ఆంధ్రప్రదేశ్‌లోని ముర్వకొండ దగ్గర కృష్ణానదిలో కలుస్తుంది. శృంగేరి, సిరుగుప్ప,హంపి, కంప్లి, గంగావతి,మంత్రాలయ,కర్నూల్ నగరాలు తుంగభద్ర నది ఒడ్డున ఉండటం వల్ల వాటికి ప్రత్యేకత ఉందన్నారు. విద్యార్థులు నీటి నిల్వ ప్రయోజనాల గురించి తెలుసుకోవాలని, భూగర్భ జలాలను పెంచడానికి గ్రామాల్లోని వ్యవసాయ బావులు, సరస్సులు, బావులలో నీటిని సేకరించాలని అన్నారు. ఈసందర్భంలో దిల్షాద్‌బేగం,చన్నమ్మ, వైశాలి, శ్వేత ఉమ్మహాని, రామాంజినేయ ,గురుప్రసాద్,విజయ మంద్రగి ,విద్యార్థి ప్రతినిధి అనూష తదితరులు పాల్గొన్నారు.

మైసూరు రాజుల భూమిపై రాజకీయం సరికాదు

● వివాదాలు సృష్టించి లాక్కోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర : మాజీ మంత్రి శ్రీరాములు



బళ్లారి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మైసూరు రాజుల కాలం నాటి హరేమనె స్థలం విషయంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేయడంం సరి కాదని మాజీ మంత్రి, బీజేపీ నాయకులు బి. శ్రీరాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బళ్లారిలో శ్రీరాములు నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలో మైసూరు రాజులంటే ప్రత్యేక అభిమానముందని, అది రాజుల కాలం నుంచి వచ్చిన ప్రతిష్ఠ, అలాంటి మైసూరు రాజులకు చెందిన స్థలం విషయంలో కాంగ్రెస్ పార్టీ దురుద్దేశంతో లాక్కోవాలని చూస్తుందని ఆరోపించారు. మైసూరు రాజ వంశస్థుడైన యదువీర్ బీజేపీ ఎంపీ కావడంతో ఆయనపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టిందన్నారు. రాజుల కాలంనాటి స్థలాన్ని వివాదంలోకి లాగడం సరికాదన్నారు. సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నా లాక్కోవాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలో గ్యారెంటీ పథకాల పరిశీలనకు కమిటీ వేసి అందులో రూ.300 కోట్లు నిధులు కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే ఇస్తున్నారని ఆరోపించారు. కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బళ్లారి గడిగె చెన్నమ్మ సర్కిల్ విషయంలో బీజేపీ ప్రభుత్వం ఒక మోడల్‌గా తయారు చేయాలనుకుంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దాన్ని రూప లేకలు మార్చి ప్రజలకు ఇబ్బంది కలిగేలా చేశారని ఆరోపించారు. లెబనార్ దేశంలో పెన్సిల్ తరహాలో ఉండే స్థూపం ఆధారంగా ఇక్కడ అలా చేయాలని చూస్తే, దాని రూపు రేఖలు మార్చేశారని ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి రాగానే పూర్తి స్థాయిలో గడిగె చెన్నప్ప సర్కిల్‌ను తీర్చిదిద్దుతామన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులేవీ?

● న్యాయం చేయకపోతే ఉద్యమిస్తాం: పింజర కులస్థుల హెచ్చరిక



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పింజర సంఘం నాయకులు

బళ్లారి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పింజార కులస్తులకు (నదాఫా)లకు తీరని అన్యాం జరిగిందని కర్నాటక రాష్ట్ర నదాఫా, ఫింజార సంఘం ఆరోపించింది. రాష్ట్ర బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా పింజార కులస్తులకు కేటాయించ లేదని ఆరోపించారు. గురువారం బళ్లారి పత్రికా భవనంలో నదాఫా, పింజారి సంఘం నాయకులు మౌలాలి, మహమ్మద్‌సాబ్, ఎస్. నబీసాబ్, నూర్‌బాషా, దాదాఖలందర్ తదితర పింజార సంఘం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నాటకలో పింజార, నదాఫా అభివృద్ధి మండదలి ప్రకటించారే కానీ నిధులు ఎక్కడా ఇవ్వలేదని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ ప్రకటన ప్రకారం గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 20 చోట్ల ప్రెస్స్ మీట్ పెట్టి తన తమకు జరిగిన అన్యాయం పై గొంతు ఎత్తున్నామని తెలిపారు. పింజార లకు కేటగిరీ 1 కింద ఇప్పటి వరకూ సర్టిఫికెట్లు ఇస్తున్నారనిన్నారు. అలా కాకుండా కేటగిరీ 2ఏ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వేల రాజకీయ పార్టీలు హమీలు ఇస్తున్నారే కానీ నెరవేర్చడం లేదని ఆరోపించారు. పింజార కులస్తులకు ప్రత్యేక నిధి, అలాగే 2ఏ క్యాటగిరిలో చేర్చేందేకు ఉద్యమం చేస్తామని పేర్కొన్నారు. వీరితో పాటు వలీసాబ్, ఖసీంసాబ్, సొఫియా, మస్తాన్ వలి, మహమ్మద్ చౌకత్ అలీ. తదితరులు పాల్గొన్నారు.

కాడెద్దులతో రైతుల నిరసన



ఎద్దుల బండ్లతో రోడ్డుపై బైఠాయించిన రైతులు

రాయచూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా హట్టి బంగారు గనుల సమీపంలోని గురుగుంటా గ్రామం వద్ద గురువారం రైతులు సాగు నీటి కోసం ఆందోళనకు దిగారు. రాష్ట్ర రహదారి పై కాడెద్దులను నిలిపి దాదాపు గంటన్నరకు పైగా రాస్తారోకో చేపట్టారు. కాలువకు నీటిని విడుదల చేయాలని లేని పక్షంలో పంటలు నష్టపోతామన్న రైతులు అధికారుల తీరుకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కర్ణాటక రైతు సంఘం డైరేక్టర్ బసవరాజ్ కోడిహాళ్, వేల ఎకరాల్లో వేసుకున్న పంటలు ఎండిపోతున్న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందిచకపోవడం బాధ్యతరాహిత్యమన్నారు. లింగసుగూరు శాసనసభ్యుడు మానప్ప వజ్జల్ రైతులు ఆందోళన చేస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం బాధ్యతరాహిత్యమేగాక రైతు వ్యతిరేక విధానాలనను అనుసరిస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవడం దౌర్భాగ్యమన్నారు. రైతు సమస్యల గురించి జిల్లాకు చెందిన శాసనసభ్యులు, పార్లిమెంట్ సభ్యులు స్పందించకపోవడం సరికాదని ఇప్పటికైన వారు రైతు సమస్యల పై దృష్టి సారించకపోతే రైతాంగం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు.

నేడు దొడ్డ బసవేశ్వరుడి రథోత్సవం



దొడ్డబసవేశ్వర మూలవిరాట్

కంప్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన కంప్లి తాలూకా కురుగోడు దొడ్డబసవేశ్వరుడి రథోత్సవం శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణ చేపట్టినట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. అలయంలో ఉన్న నీలమ్మ దేవికి ఒడినింపే కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. భక్తులు విరివిగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

గుడిసె దగ్ధం

● ఐదు గొర్రెలు సజీవ దహనం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాయచూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని ఏగనూరు గ్రామంలో గురువారం ఉదయం జరిగిన ఒక అగ్ని ప్రమాదంలో గుడిసె పూర్తిగా కాలిపోయింది. ఈ గుడిసెలో కట్టేసిన ఐదు గొర్రెలు అగ్నికి ఆహుతై కాలి బూడిదయ్యాయి. ఏగనూరు గ్రామానికి చెందిన నరసింహలు గుడిసెలో ఉన్న వంట గ్యాస్ సిలెండర్ లీక్ కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఒక్కసారిగా నిప్పంటుకుని గుడిసెకు మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక దళం అక్కడివచ్చి మంటలు ఆర్పేలోగా ప్రమాదంలో గుడిసె పూర్తిగా కాలిపోయింది. గుడిసెలో ఉన్న ఆహార ధాన్యాలతో పాటు కొంత నగదు, ఇంట్లో ఉంచిన చెవి దుద్దులు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

వైసీపీ యువత పోరు అట్టర్ ఫ్లాప్

అనంతపురం అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేపట్టిన యువత పోరు అట్టర్ ఫ్లాప్ అయ్యిందని వాల్మీకి కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పీఎల్ఎన్ మూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేరును విద్యాదీవెనగా పేరు మార్చడం తప్పా చేసిందేమీ లేదన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

బళ్లారి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎండు మిరప కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు ఆర్. మాధవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన భారీగా పడిపోయిన ధరలతో మిరపరైతు కుదేలయ్యాడన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి క్వింటాల్‌కు రూ.13,500 మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్రంలోనే అత్యధికంగా మిరప పంటను బళ్లారి జిల్లా రూపనగుడి, కొలగల్లు, కంప్లి, కురుగోడు, సిరుగుప్ప ప్రాంతాల్లో పండిస్తున్నారని తెలిపారు. తుంగభద్ర జలాలతో ఎక్కవ మంది మిరప పంటను సాగుచేశారని తెలిపారు. అయితే ఈ ఏడాది మిరప కు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ ప్రాంతంలో మిరపను పండించే 13 జిల్లాల్లో కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు మద్దతుగా మిరప కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ రైతులను ప్రభుత్వం ఆదుకుందని, కర్ణాటక ప్రభుత్వం కూడా తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో విధానసభ ఎదుట రైతులతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు రైతులు సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సహజ వనరుల నిర్వహణపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్నడాక్టర్ కృష్ణారావు

బళ్లారి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సహజ వనరులు అయిన నీరు, నేల ను సంరక్షించుకుంటేనే సకల జీవులకు మనుగడ ఉంటుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ రీసెచ్ సెంటర్ (ఐసీఏఆర్) పరిశోధకులు డాక్టర్ విద్యార్థులకు సూచించారు. బళ్లారిలో అల్లం సుమంగళమ్మ స్మారక కళాశాలలో బాలికలకు 15 రోజుల షార్ట్ కోర్సు ఇంటర్న్‌షిప్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఈ శిక్షణ కార్యక్రమం ముగిసింది. సహజ వనరుల సమర్థవంతమైన నిర్వహణ కోసం మట్టి, నీరు సంరక్షణ పద్దతులకు సంబంధించి ఆచరణాత్మక నైపుణ్యాలు, విద్యార్థులకు బోధిస్తున్నామని తెలిపారు. సహజ వనరుల సంరక్షణ శిక్షణలో పాల్గొంటున్న బాలికలకు వర్మికంపోస్ట్‌పై లోతైన అవగాహన, ఉద్యాన పంటలలో శిక్షణ, అలాగే కోతదశలో ఆకుటు, పండ్ల కత్తిరింపులు, నీటి సంరక్షణ పద్దతులను పై శిక్షణ ఇస్తున్నట్లు కృష్ణారావు తెలిపారు. శిక్షణ పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ పరిశోధకులు డాక్టర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నదిలో యువకుడి గల్లంతు



యువకుడి కోసం గాలిస్తున్న స్థానికులు

బళ్లారి సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హవిన హడగలి తాలూకాలోని మదలగట్టి దగ్గర తుంగభద్రనదిలో శిరహట్టికి చెందిన ముగ్గురు యువకులు మునిగి మృతిచెందిన సంఘటన మరువకముందే, గదగ్ జిల్లాలోని లక్ష్మేశ్వర్ పట్టణానికి చెందిన మరో యువకుడు వినోద్ హిరేమఠ్ (28) బుధవారం నీటిలో గల్లంతు అయ్యారు. యువకుడు స్నానం చేయడానికి నదిలో దిగి మునిగిపోయాడు. ఇసుక కోసం తవ్విన గుంతల వల్ల నదిలో మదలగట్టి ప్రాంతం మృత్యుమండలంగా మారింది. మదలగట్టి ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర మాత్రమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. స్నానానికి వెళ్లే వారికి సూచించడానికి ఎవరూలేరు. ఆ ప్రదేశంలో లైఫ్‌గార్డ్ వ్యవస్థ కూడా లేదు. మదలగట్టి వంతెన దగ్గర ఇసుక తవ్వకాలను పూర్తిగా నిషేధించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదరకర ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు భద్రత ప్రాణాలను కాపాడే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.

పబ్లిక్ పాఠశాలల ప్రకటనపై నిరసన



అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆందోళనలో కన్నడ క్రియాసమితి నాయకులు

రాయచూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 400 (కేపీఎస్) పబ్లిక్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామంటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అసెంబ్లీలో ప్రకటించడాన్ని కన్నడ క్రియాసమితి వ్యతిరేకించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తు గురువారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడిన కన్నడ క్రియాసమితి నాయకులు, ఇప్పటికే రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమలు అమలులోకి రావడం వల్ల విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉప సంహరించుకుని కన్నడ భాష పరిరక్షణకు తగిన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు.

పిల్లల సంరక్షణలో నిర్లక్ష్యం వహించరాదు

● మహిళా, శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్

బళ్లారి సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): హౌస్‌కీపర్లు, చైల్డ్‌కేర్ సంస్థల్లో పనిచేసే సిబ్బంది పిల్లలను అర్థం చేసుకుని, వారి మెరుగైన భవిష్యత్తు కోసం బాగా పనిచేయాలని మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ హెచ్.విజయ్‌కుమార్ అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లాన్యాయసేవల ప్రాధికార సంస్థ, మహిళ శిశు అభివృద్ధి శాఖ, జిల్లాబాలల రక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని బీడీఏఏ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన బాల్య న్యాయం చట్టం 3015 దత్తత ప్రక్రియ, బాలల రక్షణపై శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లల సానుకూల కార్యకలాపాల్లో పూర్తిగా పాల్గొనాలి, పిల్లలు సంస్థలో ఉన్నప్పుడు వారు వేళ్లేటప్పుడు పర్యవేక్షించబడాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి జలాలప్ప మాట్లాడుతూ బాలల రక్షణ, పోషణలో బాలల సంరక్షణ సంస్థల్లో సిబ్బంది పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. ప్రతి బిడ్డ వ్యక్తిగత ఫైల్‌ను నిర్వహించడానికి, పిల్లలతో సంప్రదింపులు, పనితీరును వివరాలు పొందాలన్నారు. పిల్లల రక్షణ పెంపకంలో ఎక్కువ శ్రద్ధతో పనిచేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి మైదూరు మాట్లాడుతూ బాల్య వివాహాలు,పోక్సో కేసులను నివారించడంలో భాగస్వాముల పాత్ర చాలా ముఖ్యమైనదని, ఆపదలో ఉన్న పిల్లల రక్షణ ,పునరావాసం గురించి వారు పూర్తిగా తెలుసుకోవాలన్నారు.రిసోర్స్ పర్సన్ల నుండి సమాచారాన్ని పొందాలి,దీని ద్వారా వారు తమ సామర్థ్యాన్ని పెంచుకోవాలని, పిల్లల సంరక్షణ పెంపకంలో ఎక్కువ శ్రద్ధతో పనిచేయాలని అన్నారు.న్యాయవాది శివలీల నేషనల్ లీగల్ సర్వీసెస్ అధారిటీ స్కీమ్ గురించి పూర్తిసమాచారం అందించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ దేవేంద్ర, చైల్డ్ వేల్ఫేర్ సభ్యుడు మంజునాథ్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ చన్నబసప్పపాటిల్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కాత్యాయిని, ఆనంద్ చైల్డ్‌కేర్ సంస్థల సిబ్బంది, 60మందికిపైగా శిబిరార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్

మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి మండలి అధ్యక్షురాలు పల్లవి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మండలి అధ్యక్షురాలు పల్లవి

బళ్లారి గాంధీనగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సామాజికంగా, విద్యాపరంగా, రాజకీయంగా, ఉద్యోగపరంగా అవకాశాలను సృష్టించుకుని మహిళలు అభివృద్ధివైపు అడుగు వేయాలని కర్ణాటక ఎస్సీ, ఎస్టీ, అలెమారి అభివృద్ధి మండలి అధ్యక్షురాలు పల్లవి పిలుపునిచ్చారు. నగరంలోని విజయనగర శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయం జీవ విజ్ఞన సభాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన ' అంతర్జాతీయ మహిళా దినోత్సవం' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. దేశంలో మహిళలను పూజించే స్థానంలో ఉన్నా, మహిళలను సమాజం ముఖ్యవాహినిలోకి రావాలని, పురుష ప్రధాన దేశంలో మహిళల ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పైకి ఎదగాలన్నారు. విద్యకు దూరంగా పిల్లల విద్యాభివృద్ధి కోసం10శాతం రిజర్వేషన్‌కల్పించిందని, దీనిని మహిళలు ప్రశ్నించే మనోభావవన పెంచుకుంటే ముందుకు రావడం సాధ్యమన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎస్.ఎన్.రుద్రేష్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు నాలుగు గోడలకే పరిమితం కారాదని, సమాజంలో ఒక స్థానం సంపాదించుకుని ముందుకు రావాలన్నారు. సావిత్రిబాయి పులె, కిత్తూరు రాణి చెన్నమ్మ, ఓనకె ఓబవ్వ, మదర్ థేరిసా, అక్కమహాదేవిల ఆదర్శాలు నేటి మహిళలకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కులపతి ప్రొఫెసర్ ఎం.మునిరాజు మాట్లాడుతూ, కళ్యాణ కర్ణాటక భాగంలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యం కల్పించాలని కోరారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు పతకం, ప్రమమాణ పత్రాలు అందజేయగా, కార్యక్రమం అనంతరం జానపద సంగీతం, హాస్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మౌల్యాంగన విభాగం రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.ఎం. సాలి, డాక్టర్ అంశుమాలి, డాక్టర్ గోపాల్‌లతోపాటు వివిధ విభాగాల డీన్‌లు, యునివర్సిటీ ప్రముఖులు, విద్యార్థుతు, సిబ్బంది పాల్గొన్నారు.

హోసూరు జోన్

హస్తకళల ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



జ్యోతి వెలిగించి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.ప్రకాశ్

హోసూరు మార్చి 13(ఆంధ్రజ్యోతి): హస్తకళల అభివృద్ధి సంస్థ భూంభూగారు అవుట్‌లెట్ ప్రత్యేక హస్తకళలు, చేనేత వస్త్రాలు, ఆభరణాల ప్రదర్శనను ఎమ్మెల్యే వైప్రకాశ్ గురువారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన హస్తకళల వస్తువులు కొని చేతివృత్తిదారులను ప్రోత్సహించాలన్నారు.. వస్తువుల్లో స్వామిమలై, పంచకోల విగ్రహాలు, నాచియార్, తంజావూరు ఆర్ట్ ప్లేట్లు, తంజావూరు ఆర్ట్ పెయింటింగ్స్ , గంధపు శిలలు, వివిధ రకాల దీపాలు, రాతి శిల్పాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కనీసం రూ.50 నుంచి రూ.6.5 వేల వరకు హస్తకళలు ఈ ప్రదర్శనలో ఉన్నాయి. ఈ ప్రదర్శనలో సుమారు రూ.15 లక్షల వరకు అమ్మకాలకు ఉంచారు. ప్రత్యేక ఉత్పత్తులపై తగ్గింపు ఇవ్వబడుతుందని తెలిపారు. అన్ని క్రెడిట్ కార్డులు, సర్వీస్ ఛార్జీలు ఉండవని, యూపీఐ లావాదేవీల ద్వారా నిధులను బదిలీ చేయవచ్చని మేనేజర్ నరేంద్ర బోస్ తెలిపారు.

సమాచార చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న కమిషనర్ సెల్వరాజ్

హోసూరు(కృష్ణగిరి) మార్చి 13(ఆంధ్రజ్యోతి): తమిళనాడు సమాచార కమిషన్ కమిషనర్ సెల్వరాజ్ నేతృత్వంలో కృష్ణగిరి జిల్లా గ్రామీణాభివృద్ది సంస్థ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అవగాహన శిబిరం గురువారం జరిగింది, కృష్ణగిరి జిల్లాలో సమాచార హక్కు చట్టం అవగాహన శిబిరంల్లో అన్ని శాఖల తరఫున పాల్గొన్న పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికార్లు తమిళనాడు సమాచార కమిషనర్ సమాచార చట్టం క్రింద లేవనె ప్రశ్నలకు కమిషనర్ సమాధాన మిచ్చారు. ఇంకా, పిటిషనర్లు దరఖాస్తు చేసుకున్న సమాచార హక్కు చట్టం క్రింద కోరిన సమాచారంపై వెంటనే స్పందించాలని ప్రజా సమాచార అధికారులను ఆదేశించారు. గతంలో సమాచార చట్టం క్రింద అప్పీళ్లపై కేసుల విచారణ జరిగింది, ఈ కార్యక్రమంల్లో జిల్లా కలెక్టర్ లోని ఇంటర్వ్యూ అసిస్టెంట్ జనరల్ కుమరన్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ నమచివాయం, అన్ని శాఖల సమాచార అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కొక్కొండ వెంకటరత్నం పంతులు (జయంతి)



'మహామహోపాధ్యాయ' బిరుదు పొందిన ఆధునికాంధ్రుల్లో రెండో వ్యక్తి కొక్కొండ వెంకటరత్నం పంతులు 1842 మార్చి 14న గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. కవి, నాటక రచయిత, పత్రికా సంపాదకుడు, ఉపాధ్యాయుడు, సంగీతజ్ఞులు. గ్రాంథికమే మాట్లాడేవారు. ఆంధ్రభాషా జాన్సన్ అనే గౌరవం కూడా పొందారు. ఆంధ్ర వాఙ్మయంలో నవయుగ ప్రవర్తక త్రయంలో (చిన్నయ సూరి, వెంకటరత్నము, వీరేశలింగము) ఈయన మధ్యమ స్థానాన్ని పొందారు. సుదీర్ఘకాలం తెలుగు పండితులుగా పనిచేశారు. ఆంధ్రభాషా సంజీవిని అనేపత్రికను స్థాపించి 20 సంవత్సరాలు నడిపాడు. సంస్కృత నాటకాలను అనువదించడంలో పద్యానికి పద్యం, గద్యానికి గద్యం వరుసగా వ్రాసే పద్ధతిని ఆయనే ఏర్పరిచారు. ఈ పద్ధతి నేటికీ అనుసరించబడుతోంది. 1915 డిసెంబరు 14న కన్నుమూశారు.

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ (జయంతి)



జర్మనీ దేశానికి చెందిన భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 1897 మార్చి 14న జన్మించారు. ఆధునిక భౌతికశాస్త్రానికి మూలమైన రెండు సిద్ధాంతాల్లో ఒకటైన జనరల్ థియరీ ఆఫ్ రిలెటివిటీ (సాధారణ సాపేక్షత)ను ప్రతిపాదించారు. తత్వశాస్త్రంలో ప్రభావవంతమైన కృషి చేశారు. మాస్ ఎనర్జీ ఈక్వివలెన్స్ ఫార్ములాను కనిపెట్టారు. ప్రపంచంలోనే అత్యంత ప్రముఖ ఫార్ములాగా గుర్తింపు పొందింది. క్వాంటం థియరీ పరిణామ క్రమానికి ముఖ్యమైన ఫోటోఎలక్ట్రిక్ ఎఫెక్ట్‌ను కనిపెట్టారు. 1921లో నోబెల్ పురస్కారం అందుకున్నారు. 1955 ఏప్రిల్ 18న కన్నుమూశారు.

కేవీ మహదేవన్ (జయంతి)



దక్షిణాదిన జాతీయస్థాయిలో ఉత్తమ సంగీత దర్శకుడి పురస్కారం అందుకున్న తొలి వ్యక్తి కేవీ మహదేవన్ 1917 మార్చి 14న తమిళనాడు రాష్ట్రం నాగర్‌కోయిల్ ప్రాంతంలో జన్మించారు. సినీ జీవితం ప్రారంభంలో కొన్ని చిత్రాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా నటించారు. తర్వాత మిత్రుల సలహాతో సంగీత దర్శకుడు ఎస్‌వీ వెంకట్రామన్ దగ్గర సహాయకులుగా చేరారు. సంగీతంలో రాణించారు. ఎక్కువగా కవి పాట రాశాక స్వరపరిచేవారు. మంచి మనసులు సినిమాలో ఆయన స్వరపరిచిన 'మామ మామ' అనే పాట బహుళ ప్రజాదరణ పొందింది. శంకరాభరణం సినిమాకు జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడి పురస్కారం పొందారు. శాస్త్రీయ సంగీతాన్ని సినిమా సంగీతంతో మిళితం చేసే ఒరవడికి ఆద్యుడిగా భావిస్తారు. స్వరబ్రహ్మ, సంగీత చక్రవర్తి, కందన్ కరుణై తదితర పురస్కారాలు అందుకున్నారు. 2001 జూన్ 22న కన్నుమూశారు.

నాయని కృష్ణకుమారి (జయంతి)



ప్రముఖ తెలుగు రచయిత్రి నాయని కృష్ణకుమారి 1930 మార్చి 14న గుంటూరు జిల్లాలో జన్మించారు. తండ్రి సుబ్బారావు నుంచి సాహిత్యంపై అభిలాష పెంచుకుని 18ఏళ్లకే 'ఆంధ్రుల కథ' అనే పుస్తకాన్ని రచించారు. ఆ పుస్తకాన్ని అప్పట్లోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠ్య పుస్తకంగా తీసుకుంది. ఉస్మానియా యూనివర్సిటీలో లెక్చరర్‌గా కెరీర్‌ను ప్రారంభించి రీడర్‌గా, ప్రొఫెసర్‌గా, అనంతరం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి వైస్‌చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. తెలుగు జానపద సాహిత్యంలో పీహెచ్‌డీ అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, గృహలక్ష్మి స్వర్ణకంకణం గౌరవాలు అందుకున్నారు. 2016 జనవరి 30న కన్నుమూశారు.

ఫరీదా జలాల్ (పుట్టినరోజు)



ఫరీదా జలాల్ 1949 మార్చి 14న న్యూఢిల్లీలో జన్మించారు. పలు సినిమాలు, టీవీ సీరియళ్లలో నటించారు. సహాయనటిగా గుర్తింపు పొందారు. భర్త తబ్రెజ్ బర్మావర్ కూడా నటుడే. ఆయన 2003 సెప్టెంబరులో కన్నుమూశారు. నాలుగు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, ఇతర గౌరవాలు అందుకున్నారు. 50ఏళ్లలో 200కుపైగా సినిమాలలో నటించారు. ఆరాధన, కభీ ఖుషీ కభీ గమ్, దిల్‌వాలే దుల్హనియా లేజాయంగే సినిమాలు ఎంతో గుర్తింపు తెచ్చాయి.

అమీర్‌ఖాన్ (పుట్టినరోజు)



దేశ ప్రముఖ నటులలో ఒకరైన 'పద్మభూషణ్' పురస్కార గ్రహీత మొహమ్మద్ అమీర్ హుసేన్ ఖాన్ 1965 మార్చి 14న బొంబేలో జన్మించారు. 30 ఏళ్ల కెరీర్‌లో నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా వ్యవహరించారు. బుల్లితెరపై హోస్ట్‌గా వ్యవహరించారు. 9 ఫిల్మ్‌ఫేర్, 4 నేషనల్ ఫిల్మ్ అవార్డులు, పద్మశ్రీ సహా ఉన్నతమైన పురస్కారాలు అందుకున్నారు. ఆయన నటించిన లగాన్ సినిమా ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. కాగా సామాజిక కార్యక్రమాలతో మానవతావాదిగా కూడా పేరొందారు.




ధ్వంసమైన కుర్చీలు

కూర్చుంటే.. కూలిపోరా..!

ప్రభుత్వ పాలనా వ్యవహారాలు... ప్రజలు ఎదుర్కొనే సమస్యలు.... ఎంతో కాలంగా ఉండే శాసనాల సవరణలకు వేదికగా శాసనసభ ఉంది. ప్రస్తుతం బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, పరిషత్‌లో ఎమ్మెల్సీలు పాల్గొంటున్నారు. సభలో ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, సభ్యులు కూర్చొనే సీట్లు విలాసవంతంగా ఉంటాయి. శాసనసభ కలాపాలు ఎలా జరుగుతాయనే ఉత్సాహం.. తమ ప్రాంత సభ్యులు ఎలా మాట్లాడతారు ఏవిధమైన అంశాలను ప్రస్తావిస్తారనే ఉల్లాసంతో సభకు వచ్చేవారు సీట్లు చూస్తే మాత్రం జడుసుకోవాల్సిందే. ఇలాంటి కుర్చీల్లో కూర్చొంటే కిందకు పడిపోతామనే భయం నిత్యం విధానపరిషత్‌లో వెంటాడుతుంటోందనేందుకు ఇవే సాక్ష్యాలు. సందర్శకులవి మాత్రం ఇలా చినిగిపోయాయి. కనీసం మరమ్మతు చేయించలేరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. -ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్



అమరాపూర్ క్రాస్ వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

సాగునీటి కోసం రైతుల ఆందోళన

రాయచూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నారాయణపూర్ కుడి కాలువకు ఏప్రిల్ 20వ తేదీ వరకు సాగునీటి విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. నీటి సలహా సమితి తీసుకున్న నిర్ణయం మేరకు మార్చి 23న నీటి విడుదల నిలిచిపోతే వేల ఎకరాల్లో సాగు చేసిన పంటలు ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి సలహా సమితి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తు సాగునీటి కోసం కర్ణాటక ప్రాంత రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు గురువారం జిల్లాలోని అమరాపూర్ క్రాస్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఉదయం 9గంటలకే రోడ్లపైకి చేరుకున్న రైతులు రాస్తారోకోకు దిగడంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. దీంతో ప్రయాణీకులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రాంత రైతు సంఘం నాయకుడు చన్నప్ప, వేల ఎకరాల్లో సాగు చేసిన పంటలు మరో నెలన్నర రోజుల పాటు నీటి అవసరం ఉందని ప్రభుత్వం నీటి సలహా సమితి నిర్ణయం మేరకు ఈ నెల 23న నీటి విడుదల నిలిపివేస్తే పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు లక్షల్లో నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఇప్పటికే నష్టాల పాలుకాగా రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు చేతికందకపోతే అప్పుల పాలైయ్యే దుస్థితి తలెత్తిందన్నారు. ఈ క్రమంలో అధికారులు జోక్యం చేసుకుని ఏప్రిల్ 20వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఇచ్చుకోండి.. లేఅవుట్ వేసుకోండి

- రెచ్చిపోతున్న పంచాయతీ కార్యదర్శులు
- అహుడా పరిధిలో అక్రమాల పర్వం
- లక్షల్లో డిమాండ్ చేస్తున్న వైనం
- ఆలస్యంగా వెలుగులోకి వస్తున్న ఘటనలు



శిర-కొడికొండ జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ఓ లేఅవుట్

హిందూపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం అయ్యాయి. ఎక్కడగాని భూములు వ్యాపారాలు ముందుకు సాగలేదు. రియల్ వ్యాపారం అదఃపాతాళానికి పడిపోయింది. దీనివల్ల లేఅవుట్ వేయలేని పరిస్థితి. పంచాయతీ సర్పంచులు ఇప్పటికీ 95శాతం వారే ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తరువాత భూముల వ్యాపారం పుంజుకుంటూ వస్తోంది. దీనివల్ల కొన్నిచోట్ల లేఅవుట్లు వేస్తున్నారు. అయితే కొంతమంది వైసీపికి చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఒత్తిడి పెట్టిస్తూ లేఅవుట్‌లు వేస్తున్నవారితో డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. హిందూపురం నియోజకవర్గంలో ఇప్పటికే కొన్నిచోట్ల అనుమతులు ఇవ్వడానికి పంచాయతీ కార్యదర్శులు లక్షల్లో డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కొన్నిచోట్ల వైసీపీ సర్పంచులతోపాటు ఒకరిద్దరు కూటమి నాయకులు చేతులు కలిపి పంచాయతీ కార్యదర్శులతో డబ్బులు డిమాండ్ చేయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రెచ్చిపోతున్న పంచాయతీ కార్యదర్శులు

- లేపాక్షి మండల పరిధిలో రెండెకరాల్లోపే ఉన్న భూమిలో లేఅవుట్ వేసేందుకు పంచాయతీ నుంచి అనుమతి కావాలని రియల్టర్లు కోరారు. అయితే అందుకు ఓ కార్యదర్శి సుమారు రూ.10లక్షలు డిమాండ్ చేసి రూ.5లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు నియోజకవర్గంలో కోడై కూస్తోంది. లేపాక్షి మండల పరిధిలో ఓ పంచాయతీ హిందూపురం పట్టణానికి సమీపంలో ఉంది. ఇక్కడ మూడెకరాల లేఅవుట్ వేశారు. అందుకు పంచాయతీ నుంచి అనుమతి కోసం వెళ్తే ఏకంగా రూ.20లక్షలు డిమాండ్ చేసినట్లు రూ.10లక్షలకు వ్యాపారం కుదుర్చుకున్నట్లు సమాచారం. చిలమత్తూరు మండలంలో ఓ కార్యదర్శి లేఅవుట్ కోసం రూ.8లక్షలు డిమాండ్ చేసినట్లు బాధితులు ఎమ్మెల్యే కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఇదేమండలంలో జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ఓ పంచాయతీ పరిధిలో రెండెకరాల లేఅవుట్ కోసం సదరు కార్యదర్శి రూ.10లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. నియోజకవర్గంలో లేఅవుట్‌లో వేస్తున్నవారిని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేస్తున్న ఘటనలు పరిశీలిస్తే ఎవరుకూడా రూ.10లక్షలలోపు డిమాండ్ చేసిన దాఖలాలు లేవని తెలుస్తుంది. దీంతో కొంతమంది అత్యుత్సాహం ప్రదర్శించి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

అహుడా పరిధిలోనూ..

హిందూపురం నియోజకవర్గంలోని మూడు మండలాలు అహుడా కింద ఉన్నాయి. దీనివల్ల ఎవరైనా లేఅవుట్ వేయాలంటే అహుడా అనుమతి పొందాలి. కాని కొంతమంది రియల్టర్లు అహుడా అనుమతి మేరకు వేస్తే లాభం తగ్గుతుందన్న ఆలోచనతో కొంతమంది పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో కలిసి అనుమతి పొంది ప్లాట్లు విక్రయిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి భారీగా గండిపడే అవకాశం ఉంటుంది. పంచాయతీ నుంచి అనుమతి పొందితే తక్కువ మొత్తంలో పనిముగించుకుంటారు. అహుడా అయితే ఎక్కువ మొత్తంలో చెల్లించుకోవాల్సి ఉంటుంది. దీంతో పంచాయ తీ అనుమతుల మీదే రియల్టర్లు ఆధారపడి ఉంటారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

మాకొచ్చేది కొసరే కదా..

ఇదిలా ఉంటే పంచాయతీ కార్యదర్శుల మనోగతం వేరేలా ఉంది. మేము ఎంత డిమాండ్ చేసి తీసుకొచ్చినా కొసరు మాత్రమే మిగులుతోందని సర్పంచులు, మరికొందరు నాయకులకు సమర్పించుకోవాల్సి ఉంటుందని కొంత మంది బహిరంగంగా చెప్పుకుంటున్నారు. దీనివల్ల సర్పంచులకు, కూటమి నాయకులకు పంచడమేకాని మాకు మిగిలేది ఎంత అంటూ ప్రశ్నిస్తున్నారు.

పలు రైళ్లకు అదనపు
స్టాపేజీల కొనసాగింపు



విజయవాడ రైల్వేస్టేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పలు రైళ్లకు అదనపు స్టాపేజీలను మరో ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా కొనసాగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. 17011 హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, 17012 సిర్పూర్ కాగజ్‌నగర్-బీదర్, 12713 విజయవాడ-సికింద్రాబాద్, 12714 సికింద్రాబాద్-విజయవాడ, 12706 సికింద్రాబాద్-గుంటూరు, 12705 గుంటూరు-సికింద్రాబాద్ రైళ్లు ఈ రోజు నుంచి చర్లపల్లి స్టేషన్‌లో ఆగుతాయి. 12072 హింగోళిడెక్కన్-ముంబయి సీఎస్ఎన్ టెర్మినస్ అప్ అండ్ డౌన్ రైళ్లు, పర్బారు, సెలులో 20701, సికింద్రాబాద్-తిరుపతి అప్ అండ్ డౌన్ రైలు మిర్యాలగూడలో, 17646 రేపల్లె-సికింద్రాబాద్ రామన్నపేటలో ఆగుతాయి. 12787 నర్సాపూర్-నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ 15, 16 తేదీల్లో మహబూబాబాద్‌లో ఆగుతుంది. 17479 పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20న, 17480 తిరుపతి-పూరి ఈ నెల 21న, 17481 బిలాస్‌పూర్-తిరుపతి ఈ నెల 18న, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ రైళ్లు ఈ నెల 16న కొవ్వూరు స్టేషన్‌లో ఆగుతాయి. 20896 భువనేశ్వర్-రామేశ్వరం రైలు ఈ నెల 21న, 20895 రామేశ్వరం-భువనేశ్వర్ రైలు ఈ నెల 23న, 12867 హౌరా-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23న, 16583 పుదుచ్చేరి-హౌరా ఈ నెల 19వ తేదీన రాజమండ్రి స్టేషన్‌లో ఆగుతాయి. 16583 యశ్వంత్‌పూర్-లాతూర్ ఎక్స్‌ప్రెస్ ఈ రోజు, 16584 లాతూర్-యశ్వంత్‌పూర్ ఈ నెల 15న కమలానగర్ స్టేషన్‌లో ఆగుతాయి. 22151 పూణే-ఖాజీపేట ఈ నెల 21న, 22152 ఖాజీపేట-పూణే ఈ నెల 23న మంచిర్యాల స్టేషన్‌లో ఆగుతాయని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.

హావెల్స్ ప్రతినిధులుగా..
నయనతార, విఘ్నేష్

బెంగళూరు, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉపకరణాలలో పేరొందిన హావెల్స్ సంస్థ దక్షిణభారత్ రాయబారులుగా ప్రముఖ హీరోయిన్ నయనతార భర్త విఘ్నేష్‌ను నియమించినట్లు ప్రకటించారు. ఈమేరకు గురువారం బెంగళూరులో కంపెనీ ప్రతినిధులు ప్రకటన విడుదల చేశారు. హావెల్స్ ఇండియా మార్కెటింగ్ ఛైర్మన్ పరాగ్ భట్నాగర్ అభిప్రాయం మేరకు తమ సంస్థ నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతి మనిషి సాధారణ అవసరాలను అత్యుత్తమంగా ఉండాలనేది మా సంస్థ ఆశయమన్నారు. దక్షిణాదిన ఐకానిక్ స్టార్ దంపతులు నయనతార, విఘ్నేష్‌లను నియమించుకోవడం సంతోషమన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అమరాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక ఆర్‌డీటీ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున్, సీడీపీఓ శాంతలక్ష్మీ, సూపర్‌వైజర్ కమలమ్మ పాల్గొని జ్యోతి ప్రజ్వలనచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాల్యవివాహాలు చేయరాదని సూచించారు. ప్రతిఒక్కరూ విద్యావంతులు కావాలన్నారు.

కమనీయం.. నృసింహుడి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

చిలమత్తూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కనుమ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. బ్రహోత్సవాల్లో భాగంగా జరుగుతున్న కార్యక్రమాల్లో స్వామి వారి కల్యాణోత్సవం అత్యంత ప్రధానమైనది కావడంతో వీక్షించడానికి భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఉదయం సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. అభిషేకాలు, అర్చనలు, హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత లక్ష్మీనృసింహుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అభిజిత్ లగ్నంలో కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేశారు. కల్యాణోత్సవం తరువాత భక్తులకు మంగళహారతి, తీర్థప్రసాదాలను వేదపండితులు అందజేశారు.

నేడు స్వామి వారి బ్రహ్మ రథోత్సవం

శుక్రవారం స్వామి వారి బ్రహ్మరథోత్సవం జరగనుంది. ఉదయం అభిషేకం, అర్చనలతో పూజలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి శుభ మిథున లగ్న పుష్కరాంశంలో బ్రహ్మరథోత్సవం భక్తుల జన సందోహం నడుమ సాగననుంది. అందుకు తగిన ఏర్పాట్లను ఆలయ కమిటీ చేపట్టంది. పోలీసులు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

నేడు కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం

పావగడ(ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవి సమేతుడై కొలువుతీరిన కనుమ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మరథోత్సవం ఫాల్గుణమాసం, పౌర్ణమి రోజున శుక్రవారం జరగనుంది. మధ్యాహ్నం 12 గంటలకు రథోత్సవం ప్రారంభం కానుంది. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొననున్నారు.

హైవే విస్తరణ కోసం ఇళ్ల కూల్చివేత



ఆర్డీవో సమక్షంలో ఇళ్లను కూల్చివేస్తున్న సిబ్బంది

గోరంట్ల, మార్చి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి గ్రామంలో హైవే విస్తరణలో భాగంగా ఇళ్లను గురువారం ఆర్డీవో సమక్షంలో కూల్చివేశారు. బూదిలి ఎస్సీకాలనీలో మూడునెలల క్రితం 33 నివాసాలకు ప్రభుత్వం హైవే విస్తరణలో భాగంగా ఇళ్లు తొలగించాలన్న ప్రతిపాదనతో పరిహారం అందించింది. వారికి ఇంటి స్థలాలు ఇవ్వడానికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. వారు ఇళ్లు ఖాళీచేయకపోవడంతో ఆర్డీఓ గ్రామానికెళ్లి చర్చించి కొన్ని ఇళ్లను తొలగించారు. కొందరు రెండు రోజుల సమయం అడగడంతో ఆర్డీవో అంగీకరించారు. అనంతరం ముద్దనూరు టూ హిందూపురం ఎన్‌హెచ్ 716 జి రోడ్డు విస్తరణ కోసం 3.64 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండడంతో కొండాపురం ఆర్‌ఎస్కేలో ఆర్డీవో గ్రామసభ నిర్వహించి 35 మంది రైతులతో పరిహారం విషయంగా చర్చించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ మారుతి, ఎన్‌హెచ్ డిఈ గిడ్డయ్య, సిఐ శేఖర్, కార్యదర్శి గంగాధర్‌నాయక్, వీఆర్‌ఓలు అనిల్, సల్మాన్, ఓబులేసు, రమేష్, ప్రవీణ్, సర్వేయర్ చైతన్య ఉన్నారు.

ఆవుల అపహరణపై కేసు నమోదు

గోరంట్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూచేపల్లికి చెందిన ఆరు పాడి ఆవులు చోరీ జరిగిన సంఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. బూచేపల్లికి చెందిన నారాయణస్వామి కుమారుడు వెంకటేశ్ ఇంటిముందు పశువుల పాకలో ఆరు జర్సీ ఆవులు ఫిబ్రవరి 22న చోరీకి గురయ్యాయి.

మహిళల ఆరోగ్యంపై నిరంతర చైతన్య కార్యక్రమాలు

బెంగళూరు, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యంపై నిరంతరంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించదలచామని అపోలో క్రెడల్ చిల్డ్రన్ ఆసుపత్రి సీనియర్ కన్సల్‌టెంట్ పూర్ణిమా రామకృష్ణ అభిప్రాయపడ్డారు. గురువారం నగరంలో టుగెదర్ ఫార్ హర్ వెల్‌బీయింగ్ పేరిట(ఆమె శ్రేయస్సు కోసం సహకారం) అనే చైతన్య కార్యక్రమాన్ని ఎంఎస్‌డి ఫార్మాస్యూటికల్స్ సహకారంతో శ్రీకారం చుట్టారు. పూర్ణిమ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి మహిళా ఏడాదికోసారి గైనకాలజిస్టును సంప్రదించాలి. రుతుచక్రం ప్రారంభం నుంచి ప్రక్రియ కొనసాగించాలి. వ్యాక్సినేషన్‌లను వైద్యుల సలహాలతో తీసుకోవాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తినట్టు అనుమానం వస్తే పరీక్షలు జరిపించుకోవాలని, రోగలక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని వ్యాయామం చేయాలని, ఒత్తిడిని తగ్గించుకోవాలని హార్మోన్‌ల సమతుల్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించదలచామన్నారు. అపోలోతో పాటు ఎంఎస్‌డీ సంస్థలు సంయుక్తంగా అవకాశం ఉన్న ప్రతి చోటా మహిళలో చైతన్యం తీసుకురాదలచినట్లు వైద్యనిపుణురాలు ఫణిమాధురి తెలిపారు.